## భారత్ జోడో యాత్రకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

**తిరుమలగిరి నవంబర్ 01 ప్రభాతవార్త**



రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందర్భంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో జరిగే రాహుల్‌గాంధీ సభకు తిరుమలగిరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు వై.నరేష్, ఎంపిటిసి జమీలాల్, పాలకుర్తి రాజయ్య, మల్లయ్య, యాదగిరి, భాస్కర్, సోమేష్ తదితరులు ఉన్నారు.

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

## జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకుడు

**తిరుమలగిరి నవంబర్ 01 ప్రభాతవార్త**



తిరుమలగిరి మండలానికి చెందిన లావుడ్య మహేష్ మంగళవారం హైదరాబాద్‌లో భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి యాత్రలో కొనసాగాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి తన వంతుకృషి చేస్తానని తెలిపారు.

## విద్యారంగంలో అసమానతలు పెంచిపోషిస్తున్న కేంద్రం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**




బిజెపి తెస్తున్న నూతన విద్యా విధానంతో మహిళా విద్యాభివృద్ధి నష్టం జరిగి దేశంలో విద్యా అసమానతలు పెరిగే అవకాశం ఉందని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపల్లి యాదయ్య పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటి ఆధ్వర్యంలో శ్రీగాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో నూతన జాతీయ విద్యావిధానం ఒక పరిశీలన అనే అంశంపై పట్టణ కార్యదర్శి చింతల శివ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం అమలులో పాఠశాలలు విలీనం అయ్యి మహిళా విద్య కుంటుపడుతుందని, ఇప్పటికే దేశంలో మహిళా అక్షరాస్యత 40 శాతం ఉంటే నూతన విద్యా విధానం అమలుతో మరింత వెనక్కి వెళ్తుందన్నారు. రాష్ట్రంలో మహిళా విద్యా సంస్థల్లో నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సెమినార్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వనం రాజు, పట్టణ ఉపాధ్యక్షులు బుగ్గ ఉదయ్, కార్తిక్ రమణ, అభిమన్యు, సునీల్, రమ్య, అంజలి, మానస విద్యార్థులు పాల్గొన్నారు.

## మునుగోడు ఉప ఎన్నికల్లో కూసుకుంట్ల గెలుపు ఖాయం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల గెలుపు ఖాయమని భువనగిరి ఎంపిపి నరల నిర్మల వెంకటస్వామి యాదవ్, వలిగొండ, రామన్నపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొనపురి కవిత రాములు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆదేశానుసారం జైకేసారం గ్రామంలో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేయాలంటూ గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుబ్బూరు బీరుమల్లయ్య, చందుపట్ల పిఏసిఎస్ మాజి చైర్మన్ బల్గూరి మదుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మాజి ఎంపిపి కేశవపట్నం రమేష్, సర్పంచ్‌లు చిన్నం పాండు, జక్క రాఘవేందర్‌రెడ్డి, పుట్ట వీరేష్ యాదవ్, చిన్నం బీరప్ప, దంతూరి సత్యనారాయణ, పల్లెపాటి రవికుమార్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిభిరం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ మరియు డాక్టర్ సుమంత్ కంటి ఆసుపత్రి భువనగిరి ఆధ్వర్యంలో భువనగిరి మండలం పెంచికలపహడ్ గ్రామానికి చెందిన బాసాని యాదగిరి, యాదగిరిగుట్ట, రాళ్ల జనగాం గ్రామానికి చెందిన ధరావత్ పులియా నాయక్, ధరావత్ హనుమా నాయక్ లకు ఉచితంగా కంటి శుక్లాల శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఫక్కీరు కొండల్‌రెడ్డి, కోశాధికారి మహ్మద్ హనీఫ్ మెమన్, ఆస్పత్రి సిబ్బంది, రోగుల సహాయకులు పాల్గొన్నారు.

## జిల్లా అధనపు కలెక్టర్ పేరుతో మెసేజ్‌లను పట్టించుకోవద్దు

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి పేరు మీద ఆయన ఫోటోతో గుర్తు తెలియని నంబర్ ద్వారా కొంతమంది అధికారులకు ఆర్థిక సహాయం కోసం తప్పుడు వాట్సాప్ మెసేజీలు పంపుతున్నారని, దీనిపై పోలీసు కేసు కూడా ఫైల్ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనతో తెలిపారు. ఎవ్వరూ ఇటువంటి మెసేజీలు నమ్మవద్దని, పట్టించుకోవద్దని తెలిపారు.

**కేసు నమోదు..**

గుర్తు తెలియన వ్యక్తులు వాట్సాప్ క్రియేట్ చేసి ఇతరుల పేరుతో మెసేజీలు పంపిస్తున్నారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్ తెలిపారు. వివరాలను పరిశీలిస్తే అదనపు కలెక్టర్ దీపక్ తివారి పేరుతో తప్పుడు వాట్సాప్ క్రియేట్ చేసి ఆర్థిక సహాయం పేరుతో మెసెజిలు చేస్తున్నారని కలెక్టర్ సిసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవ్వరైనా మెసేజిలు పంపిణ వెంటనే మెసెజిలు పంపిణ వ్యక్తి చిరునామను సరిచూసుకోవాలని, అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్సై రాఘవేందర్ తెలిపారు.

## కోమటిరెడ్డి గెలుపు ఖాయం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



మునుగోడు ఉప ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపు ఖాయమని సినీనటి జీవితా రాజశేఖర్ పేర్కొన్నారు. చివరిరోజు ప్రచారంలో భాగంగా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరికి చెందిన పలువురు పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నర్ల నర్సింగ్‌రావు, జనగాం నర్సింహచారి, చందా మహేందర్‌గుప్త, నీలం రమేష్, పంచెద్దుల బలరాం, పక్కీరు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వట్టికోట అల్వార్ స్వామి జయంతి

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో వట్టికోట ఆల్వార్ స్వామి 107వ జయంతి కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కమిటి చైర్మన్ జడల అమరేందర్ గౌడ్ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్వార్ స్వామి కవిగా ప్రజాస్వామ్యానికి పునాదులు వేశారన్నారు. ఉద్యమకారునిగా, గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేశాడని, రచయితగా అనేక నవలలు రాసారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుదీర్, సిడబ్ల్యుసి చైర్మన్ జయశ్రీ, గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

## వట్టికోట దారిలో నేటి యువత ప్రయాణించాలి

**మోత్కూర్, నవంబర్ 01 ప్రభాతవార్త :**



తెలంగాణ వైతాలికులు తన సంపాదనలో అధిక భాగం సాహిత్య పత్రిక కొనుగోలుకు వెచ్చించి 23 సంవత్సరాల వయస్సులోనే గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన వ్యక్తి వట్టికోట అల్వార స్వామి జీవితాన్ని నేటి విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్యగిరి అన్నారు. మంగళవారం వట్టికోట అల్వారస్వామి 102వ జయంతి సందర్భంగా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నవల రచనలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని తెలంగాణ జీవిత విదానాన్ని చాటిచెప్పిన మహనీయుడు వట్టికోట అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జ్ చిలకమర్రి బాబుచారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వట్టికోట జయంతి



**వలిగొండ, నవంబర్ 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వట్టికోట ఆల్వారు స్వామి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్వారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఊరూరా తిరుగుతూ నిజాం రాజుపై నిప్పులు చెరిగారని తన సాహిత్య ప్రభంజనంతో కవితా రూపాన ప్రజల మనిషిగా పుస్తక రూపంలో ప్రభావితం చేశారని గ్రంథాలయ అభివృద్ధి కమిటి చైర్మన్ పబ్బు వెంకటరమణ అన్నారు.

## రోడ్డు మరమ్మత్తులను చేపట్టాలి

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు మహ్మద్ అతహార్ పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ రోడ్డులో మంగళవారం వైఎస్‌ఆర్‌టిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదేవ్‌పూర్ ప్రధాన రహదారిపై రోడ్డు సమస్యలు ఉన్నాయని అధికారులకు విన్నవించినా తూతుమంత్రంగానే మరమ్మత్తులు నిర్వహిస్తున్నారని, ఒక్క వర్షం పడితే యదావిదికి చేరుకుంటుందని వాపోయారు. ఈ రోడ్డుపై ఇతర రాష్ట్రాలకు బారీ వాహనాలతో పాటు 100 గ్రామాలకు రహదారిగా ఉందని, రోడ్డుపై ప్రజాప్రతినిధులకు పట్టింపేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హన్మపురం రైల్వే బ్రిడ్జి ప్రధాన రహదారి వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సురి వెంకటేశ్ గౌడ్, పట్టణ అధ్యక్షులు సాయినివాస్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు లింగాచారి, మైనార్టీ అధ్యక్షులు వాహెద్, నాయకులు సాయికుమార్, రాఖేష్, శ్రీనివాస్, ఉమేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ పాధయాత్రకు నజీర్ సంఘీభావం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



కులమతాల మద్యన చిచ్చు పెట్టి రాయకీయ లబ్ధిపొందాలని చూస్తున్న దేశ విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను తిప్పికొట్టడానికి, ప్రజలను జాగృతం చేయడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధి చేపట్టిన భారత్ జోడో యాత్ర మంగళవారం చార్మినార్‌కు చేరుకున్న సందర్భంగా రేవంత్ అభిమాన సంఘం అధ్యక్షులు మహ్మద్ నజీర్ వెళ్లి యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ దేశ సమైక్యతా, సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన ఇంధిరా, రాజీవ్‌గాంధి ఆశయాల సాధన కోసం రాహుల్‌గాంధి కన్యాకుమారి నుండి కాశి వరకు చేపట్టిన ఈ యాత్రకు ప్రజలు అడుగడుగున బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా నజీర్‌ను రాహుల్‌కు పరిచయం చేశారు. చేయగా చార్మినర్ నుండి నక్లెస్ రోడ్డు వరకు రాహుల్‌గాంధి వెంట అడుగులో అడుగువేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రఫియొద్దిన్ గోరి, వాజిద్, అమర్, శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు 5 వేల పెన్షన్ ఇవ్వాలి

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**




50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ పేర్కొన్నారు. ఏఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తాలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును మరింత పరిష్టపరచాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి సంక్షేమ బోర్డు ద్వారా రూ.10 లక్షలు, సభ్యులుగా నమోదైన వారి పిల్లల వివాహాలకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, ఏఐటియుసి మండల కార్యదర్శి సామల శోబన్‌బాబు, బిక్షపతి నాయక్, రవినాయక్, అంజనేయులు, కృష్ణ, రాములు, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సాయిమందిరం 17వ వార్షికోత్సవం

**హాలియా, ప్రభాతవార్త. నవంబర్ 1:**

హాలియా మున్సిపాలిటీలోని శ్రీ షిరిడి సాయిమందిరం 17వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాయిమందిరం అధ్యక్షులు తేలపోలు శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ వార్షికోత్సవం సందర్భంగా తెల్లవారుజామునే కాగహారతి, 5.30కి 108 కలశాలతో సాయినాధునికి అభిషేకం, చందనోత్సవం, సంస్థాన్ హారతి, ధునిపూజ, సామూహిక భజన కార్యక్రమం, మధ్యాహ్న హారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అదే విధంగా భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించి హాలియా పురవీధుల్లో అంగరంగవైభవంగా కొక్కు శంకర్ మాస్టర్ బృందంచే కోలాట ప్రదర్శనతో సాయినాధుని శోభయాత్ర, పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు పల్లకిసేవలో పాల్గొనే మహిళలకు 21 మందికి సాయిబాబా వస్త్రాలను డ్రా తీసి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కావునా హాలియా మున్సిపాలిటీ, అనుముల మండల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అయన వెంట అలయ ధర్మకర్త మిట్టపల్లి సుబ్బారావు, అలయ కార్యదర్శి బానోతు సక్రునాయక్, కోశాధికారి మిట్టపల్లి శివకుమార్, అలయ పూజారి మనోజ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పింఛన్‌దారుల కష్టాలు

- కష్టాలు పడుతున్న 71 మంది లబ్దిదారులు
- పింఛన్‌కోసం తిరుమలగిరి నుండి హుజూర్‌నగర్ వెళ్లవలసిందే
- 100 కిలోమీటర్లు, రూ.300 ఛార్జీ

**తిరుమలగిరి నవంబర్ 01 ప్రభాతవార్త**




తిరుమలగిరి మున్సిపాల్టీకి చెందిన కొత్తగా నమోదైన ఆసరా పింఛన్‌దారులకు కొత్త కష్టాలు వచ్చాయి. తిరుమలగిరి మున్సిపాల్టీకి చెందిన 71 మంది పేర్లు సాంకేతిక లోపంతో హుజూర్‌నగర్ మున్సిపాల్టీకేంద్రంలో నమోదయ్యాయి. మున్సిపాల్టీలోని అనంతారం గ్రామానికి చెందిన చాగంటి సోమయ్య, చాగంటి చంద్రయ్య, సంగెం చిత్తం,వంగరి లింగయ్య, శీల ఆగయ్య, కళ్లెం చంద్రయ్య, ఎండి.అబ్బాస్, మాలీపురం గ్రామానికి చెందిన జనిగల రాములు, వెంకటనారాయణ మొత్తం 71 మంది వృద్ధాప్య పింఛన్లు మంజూరయ్యాయి. వారి పింఛన్లు సొంత ఊరిలో కాకుండా 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న హుజూర్‌నగర్ మున్సిపాల్టీలో తప్పుగా నమోదై పింఛన్ల కోసం 3నెలలుగా హుజూర్‌నగర్‌కు వెళ్లి లబ్దిదారులు పింఛన్లు తీసుకుంటున్నారు. మంగళవారం పింఛన్‌దారులు పలువురు ప్రభాతవార్తతో మాట్లాడుతూ సుమారు 100 కిలోమీటర్ల దూరం వెళ్లి పింఛన్ తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని అక్కడకు వెళ్లడానికి బస్‌ఛార్జీలు రూ.300 అవుతుందని చెప్పారు. అధికారులు తప్పిదం వలన మాకు ఈ సమస్య వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు ఎంపిడివో కార్యాలయం చుట్టూ తిరిగి ఎట్టకేలకు పింఛన్ మంజూరైందని ఆనందపడ్డామని, దూర ప్రాంతానికి వెళ్లి తీసుకోవలసిన పరిస్థితి రావడంతో ఆవేదన పడ్డామని చెప్పారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా మా తిరుమలగిరి మున్సిపాల్టీలోకి మార్చాలని వారు కోరుతున్నారు.

## పట్టపగలే ఇంట్లో చోరీ



- 10 లక్షల నగదు, 10 తులాల బంగారం అపహరణ

**హుజూర్‌నగర్‌టౌన్ నవంబర్ 01 ప్రభాతవార్త**

ఇంటిలో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున నగదు, బంగారం చోరీ చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబాగుడి వీధిలో నివాసం ఉంటున్న తమ్మన నాగేశ్వరరావు సుజాత దంపతులు తమ కుమారుడు జర్మనీ వెళ్లే నిమిత్తం అవసరమగు రూ.10 లక్షల నగదును ఇంటిలోని బీరువాలో దాచి ఉంచారు. కాగా మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో స్థానిక ముత్యాలమ్మ గుడి సమీపంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా జరిగిన ఓ పూజా కార్యక్రమానికి ఇరువురు హాజరయ్యారు. గంట వ్యవధిలో నాగేశ్వరరావు తిరిగి ఇంటికి వచ్చి చూడగా వెనుక నుండి తలుపులు తెరచి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిఐ రామలింగారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంటిలో దాచుకున్న రూ.10 లక్షలతోపాటు, 10 తులాల బంగారం అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది చేరుకొని ఆధారాలు సేకరించారు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## అంబేద్కర్ ఫోటో ముద్రించే విధంగా కృషి చేయాలి

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**

భారత కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించే విధంగా దేశంలోని పార్లమెంట్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేయాలని పీపుల్స్ మానిటరింగ్ కమిటి రాష్ట్ర కన్వీనర్ సుర్వంగ శివలింగం డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు రాజ్యాంగ ఫలాలను అందరికీ సమానంగా అందించేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాదన సమితి జిల్లా చైర్మన్ కొడారి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు బట్టు రాంచంద్రయ్య, ఎస్సి,ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు బర్రె సుదర్శన్, బానోతు బాస్కర్ నాయక్, రావుల రాజు, బండారు శివశంకర్, మచ్చ ఉపెందర్, ఇంజ పద్మ, కొత్త లలిత, కాచరాజు జయప్రకాష్‌రావు, వనం రాజు, అమిత్‌పాష, బొట్ల రమేష్, దేవేందర్, దర్గాయి జహంగీర్, భరత్‌కుమార్, సుమన్, జాని, జాగిల్లపురం అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలు కుటుంబానికి అండగా ఉంటాం

**భువనగిరి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



స్థానిక ప్రగతినగర్‌లో 13వ వార్డుకు చెందిన బాలు అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం గుర్రాల లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5500లను గుర్రాల శ్రీనివాస్ మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రాల సురేష్, వెంకటేశ్, అంజి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గోపూజ

**భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 01 ప్రభాతవార్త :**



కార్తీక శుద్ధ అష్టమి పురస్కరించుకుని మంగళవారం పురపాలక కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్మాణ దాత, గో సంరక్షణ సమితి అధ్యక్షులు బోగ విష్ణు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోగ బానుమతి విష్ణు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడవేరు వెంకటేశం, బోగ విజయ్‌కుమార్, దోర్నాల శ్రీనాథ్, కుసునూరి యాదగిరి, దోర్నాల కరుణాకర్, మిర్యాల వెంకటేశం, సీత కృష్ణ, రవ్వ లక్ష్మణ్, వల్లందాస్ శోభ, సకినాల జయమ్మ, గోభక్తులు పాల్గొన్నారు.

## అతిధి అధ్యాపకుల జిల్లా అధ్యక్షునిగా ఒగ్గు సతీష్

**నేరేడుచర్లటౌన్ నవంబర్ 01 ప్రభాతవార్త**



అతిధి అధ్యాపకుల సంఘం 1145 సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా డా.ఒగ్గు సతీష్ ఎన్నికయ్యారు. ఇటీవల పెరిగిన సమావేశంలో ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శిగా అందె రవి, కోశాధికారిగా పవన్‌కుమార్‌తోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఒగ్గు సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల పెంపు కొరకు రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడంలో కృషి చేస్తామని, అతిథి కన్సల్‌టెంట్‌చే ఆటో రెన్యూవల్, డిస్టబ్ అయిన అతిధి అధ్యాపకులకు వెంటనే పోస్టింగ్ వచ్చే విధంగా రాష్ట్ర నాయకుల సహకారంతో సమస్యలను పరిష్కరించి సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య, జిజిఎల్‌ఏ సూర్యాపేట అధ్యక్షుడు మద్దిమడుగు సైదులు, టిఎన్‌జివో రాష్ట్ర నాయకుడు కంది శ్రీను, కర్నాటక శ్రీధర్, పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తుల స్వీకరణ

**నేరేడుచర్లటౌన్ నవంబర్ 01 ప్రభాతవార్త**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల కోఆర్డినేటర్ ఎల్.శ్రీనివాసరావు, సహాయ కోఆర్డినేటర్ ఎన్.నర్సింహారావులు మంగళవారం తెలిపారు. 10వ తరగతిలోపు చదువు మధ్యలో మానేసిన వారు రికార్డ్ షీట్, ఆధార్‌కార్డు, పాస్‌ఫోటోలతో అడ్మిషన్ పొందవచ్చని, ఇంటర్ అడ్మిషన్ పొందేవారు10వ తరగతి మెమో, టిసి, ఆధార్‌కార్డు, ఫోటోలతో అడ్మిషన్ పొందాలని, ఇదే చివరి అవకాశం అని ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బీసీ గురుకులంలో కబడ్డీ శిక్షణ

**నాగార్జునసాగర్, నవంబర్ 1 ప్రభాతవార్త:**



నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులకు ఆర్‌సిఓ ఆదేశానుసారం గురుకుల ఇంటర్ స్టేట్ లీగ్‌లో పాల్గొనే కబడ్డీ విద్యార్థులకు సాగర్ బీసీ గురుకులంలో కోచ్ మేనేజర్ రామయ్య, పిడి జ్యోతి, జానకి రాములు ఆధ్వర్యంలో శిక్షణను ఇవ్వనున్నారు. అందులో భాగంగా మంగళవారం నాగార్జునసాగర్ గురుకుల ప్రిన్సిపాల్ రజనీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని కబడ్డీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ ఆటలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని అందజేస్తాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆటను శ్రద్ధతో క్రమశిక్షణతో ఆడి విజయం సాధించారని ఆయన ఆకాంక్షించారు.

## జిల్లా ఏర్పాటు ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకం: బంటు

**మిర్యాలగూడ రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త**



మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకమని, జిల్లా ఏర్పాటు ఉధృతి కోసం జరుగుతున్న ఉద్యమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బిసి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడను జిల్లాగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మిర్యాలగూడ మండలం తుంగపహాడ్, తెలంగాణ ప్రభుత్వ అదర్శ పాఠశాలల విద్యార్థులు నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నూతన జివో ప్రకారం జిల్లా పోస్టులలో 95శాతం ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

# దేశ భవిష్యత్ కాంగ్రెస్‌పార్టీ చేతులలోనే

**చింతపల్లి నవంబర్ 01 ప్రభాతవార్త**



దేశ భవిష్యత్ కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉందని దేవరకొండ మాజీ ఎమె ్మల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి చేపట్టిన భారత్ జోడో యాత్ర మహబూబ్‌నగర్ నుండి షాద్‌నగర్ చేరుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చింతపల్లి, దేవరకొండ నుండి అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్‌తోపాటు మరి కొంత మంది ముఖ్యనేతలు రాహుల్ గాంధీతో పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాహుల్ గాంధీ ఈ పాదయాత్ర చేపట్టారని వారన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పాదయాత్రకు భారత్ బచావో.. బిజెపి హటావో అనే నినాదాలతో పాదయాత్రకు మ ంచి స్పందన ఏర్పడి నినాదాలు చేస్తూ రైతులు, మహిళలు వారి వెంట పాల్గొంటున్నారు. రాబోవు2024 ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత ్వం అధికారం చేపట్టడం ఖాయమన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ కార్పోరేట్ వ్యవస్థకు కొమ్ము కాస్తూ వ్యాపార వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది రైతులు సంఘీభావం తెలుపుతూ రాహుల్ గాంధీతో మొర పెట్టుకుంటున్నారు. ఈ పాదయాత్రలో వీరి వెంట చింతపల్లి ఎంపిపి కొండూరు భవాని పవన్‌కుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు ఎండి.సిరాజ్‌ఖాన్, కా ంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు అంగిరేకుల గోవర్ధన్, గుండ్లపల్లి నర్సి రెడ్డి, తీదేడు సర్ ్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, దాసరి మారయ్య, బులగోని జంగయ్యగౌడ్, గడ్డం పురుషోత్తంరెడ్డి, వెంకటనర్సి రెడ్డి, సమి ్మడి రవిశంకర్‌రెడ్డి, మునుకుంట్ల శేఖర్‌గౌడ్, దుబ్బాకుల మదార్, కృష్ణ, అంగిరేకుల నాగ భూషణం వీరితో పాటు మరికొంత నాయకులు తరలి వెళ్లారు.

# మునుగోడులో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిదే విజయం

**చింతపల్లి నవంబర్ 01 ప్రభాతవార్త**



ఈనెల 3న జరగబోయే మునుగోడు ఉప ఎన్నికలలో టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిదే విజయమని టిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లి మండలంలోని ఎస్.లింగోటం, వడ్డెపల్లి, చిట్టెంపాడ్ తదితర గ్రామాల లో చివరిరోజు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి పనులే మునుగోడు విజయానికి నాంది పలుకుతుందన్నారు. మనీ, మద్యంతో ఓటర్లను కొనుగోలు చేసేందుకు బిజెపి నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని వారి ఆటలు సాగబోవన్నారు. కోట్లాది రూపాయల కోసం అమ్ముడుబోయిన రాజగోపాల్‌రెడ్డికి ఈ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమనా ్నరు. ఈ సందర్భంగా నాంపల్లి మండలంలో హరీష్‌రావురోడ్డు షో కార్యక్రమానికి పెద్ద కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎంపిపి ఎరుదొడ్ల రవీందర్‌రెడ్డి శ్వేత, చింతపల్లి మండలపార్ ్టి అధ్యక్షుడు డి.చంద్రశేఖర్‌రెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, ఇంజమూరి రవి, ఈరటి మల్లేష్, శ్రీను, నర్సి ంహ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో పాల్వాయి స్రవంతి అత్యధిక మెజార్టీతో గెలిపించండి – జీవన్‌రెడ్డి

**చింతపల్లి నవంబర్ 01 ప్రభాతవార్త**



మునుగోడులో జరుగుతున్న ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం టిపిసిసి నాయకులు జీవన్‌రెడ్డి మర్రిగూడ మండలపరిధిలోని లెంకలప ల్లి గ్రామంలో చివరిరోజు ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు ప్రాంతానికి మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధికి మహిళలు ఆడబిడ్డ అయిన పాల్వాయి స్రవంతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి కేంద్రం, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడే బిజెపి, టిఆర్‌ఎస్ అభ్యర్థులకు ఈ ఉప ఎన్నికలో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు సూచించారు. మునుగోడు ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన రాజగోపాల్‌రెడ్డికి చెంప పెట్టుకావాలన్నారు. అధికారానికి, అహంకారానికి జరుగుతున్న ఎన్నికలలో బిజెపి, టిఆర్‌ఎస్ పార్టీల వ్యక్తులను బొందపెట్టాలన్నారు. ఆడబిడ్డ అయిన పాల్వాయి స్రవంతిని మహిళలందరు ఒక్కతాటిపై నిలబడి ఓట్లు వేసి విజ యాన్ని అందించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అమ్ము ్మడు బోయిన వ ్యక్తులకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వ్యక్తులకు మునుగోడు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం చండూరులో జరిగిన రేవంత్‌రెడ్డి రోడ్ షోకు వేలాదిగా కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ ప్రచారంలో టిపిసిసి నాయకులు కేతావత్ భిల్యానాయక్, టిపిసిసి నాయకులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ప్రకాశరెడ్డి, నాయ కులు ఎండి.సిరాజ్‌ఖాన్, పటేల్ రమేష్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, గుండ్లపల్లి నర్సి రెడ్డి, కొండూరు పవన్‌కుమార్ తది తరులున్నారు.

# విద్యార్థికి సన్మానం



**కోదాడ రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాలికల వాలీబాల్ పోటీల్లో నల్లగొండ బాలికలు తెలంగాణ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ సాధించారు. దీనిలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జె. పూజితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజు, ఉపాధ్యాయ సిబ్బంది, వ్యాయాయ ఉపాధ్యాయుడు రవి, గ్రామ సర్పంచ్ పొట్ట విజయ్‌కిరణ్ సన్మానించారు.

# అభయాంజనేయస్వామి దేవాలయంలో అన్నదానం

**కోదాడ టౌన్, నవంబర్ 1 ప్రభాతవార్త**



పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఇటీవల ప్రతిష్టించిన అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస మంగళ వారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సా ్వమి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వమించారు. తెల్లవారుజాము నుండి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, పుష్పాలంకరణ వంటి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు కన్నుల పండుగగా నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సత్యం, బ్యాటరీ చారి, వంశీకృష్ణ, అప్పారావు, వాసు, అన్నదాతలు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

**నడిగూడెం, నవంబర్ 1 ప్రభాతవార్త**





కార్మికులంతా రానున్న రోజుల్లో సమస్యల పరిష్కారానికై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కోశాధికారి రాంబాబు అన్నారు. మంగళవారం స్థానికంగా సిఐటియు ఆరవ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని, కరోనా సమయంలో ప్రతి ఒక్కరు ఇళ్లకు పరిమితం కాగా కార్మికులు మాత్రం వృత్తి నిర్వహించారన్నారు. ఏళ్ల తరబడి కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగా మిగిలిపోయాయన్నారు. భవిష్యత్‌లో కార్మికులు ఐక్యంగా పోరాటం చేసి సమస్యలు సాధించుకోవాలన్నారు. సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మూడవ సారి మండల కన్వీనర్‌గా మల్లెల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా సాయిలు, వల్లెపు శ్రీను, వీరబాబు, ఉపేందర్, తిరుమలేష్ తదితరులను ఎను ్నకున్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**నడిగూడెం, నవంబర్ 1 ప్రభాతవార్త** కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మండల సిఐటియు కన్వీనర్ మల్లెల వెంకన్న అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కార్మికుల కూలీ ధరలు కూడా పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు రోజు వారీగా సరిపడా కూలీ చెల్లించడం లేదని పేర్కొన్నారు. మూడవసారి తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించినందున వమ్ము చేయకుండా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# పేదలకు స్వెటర్లు పంపిణీ

**హుజూర్‌నగర్ నవంబర్ 01 ప్రభాతవార్త**



పట్టణానికి చెందిన వందనపు నాగరాజు వరలక్ష్మిల కూతురు నవన్య పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఓపెన్‌ఐస్ సొసైటి ద్వారా రూ.50 వేలు విలువ చేసే స్వెటర్లను పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటి సభ్యులు సులువ శ్రీను, చందు, అనిల్, కృష్ణ, రమేష్, చంటి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# కవి చర్ల శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం

**మఠంపల్లి నవంబర్ 01 ప్రభాతవార్త**





అంతర్జాతీయ సాహితి సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో యాదగిరి గుట్టలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో మఠంపల్లికి చెందిన చర్ల శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం అవార్డు, ప్రశంసాపత్రం అందజేసినట్లు ఆయన మంగళవారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల తెలుగు రాష్ట్రాలలో నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక నిర్వహణలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కవి సమ్మేళనంలో తాను రాసిన నేటి మా పల్లె కవితకు జాతీయ పురస్కారం లభించిందని ఆయన తెలిపారు. 150 మందికిపైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో తనను పురస్కారానికి ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు డా.కత్తిమండ ప్రతాప్‌గారిచే పురస్కారం, ప్రశంసాపత్రం, సత్కారం అందుకోవడంసంతోషంగా ఉందని ఆయన తెలిపారు.

# ఘనంగా నృసింహుని నిత్య కళ్యాణం

**మఠంపల్లి నవంబర్ 01 ప్రభాతవార్త**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మినరసింహస్వామి క్షేత్రంలోని శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కళ్యాణంను అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ తంతు కార్యక్రమాన్ని వందలాది మంది భక్తుల నడుమ అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట ్టపల్లిరావు, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణచార్యులు, లక్ష్మినర్సిం ం హమూర్తి, ఆంజనేయాచార్యులు, భకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్పోర్ట్, గేమ్స్ డ్రెస్సుల పంపిణీ

**నడిగూడెం, నవంబర్ 1 ప్రభాతవార్త**



మండలంలోని సిరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి మొక్కా కోటేష్ రూ. 10 వేలు విలువ చేసే స్పోర్ట్స్, గేమ్స్ డ్రెస్‌లతో పాటు క్రీడా వసువ్తువులను మంగళవారం విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరికి దుస్తులు, ఆటవస్తువులతో పాటు మైక్‌కు సంబంధించిన యాంప్లిఫయర్‌ను కూడా అందజేశారు. ప్రస్తుతం తాను కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నందున చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో అందజేసినట్లు కోటేష్ పేర్కొన్నారు. ఆగస్టు 15, జనవరి 26న నిర్వహించే క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ సందర్భంగా అల్పాహారానికి అయ్యే ఖర్చును అందిస్తానన్నారు. ఉపాధ్యాయులు దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, మోతీలాల్, ఉమావతి, అశోక్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, చారి, అక్షపతి, బివిఎన్‌రెడ్డి, మీర్జా షాకీర్‌బేగ్, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు చెల్లింపుకు 10వ తేదీ తుది గడువు

**నడిగూడెం, నవంబర్ 1 ప్రభాతవార్త** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కోరే విద్యార్థులు అపరాధ రుసుముతో ఈ నెల 10లోపు ఫీజు చెల్లించాలని ప్రధానోపాధ్యాయుడు కోఆర్డినేటర్ ఎం. శోభన్‌బాబు అన్నారు. సర్టిఫికెట్‌లను తీసుకువచ్చి పాఠశాలలో ధరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు 10వ తేదీ తుది గడువు అయినందున ఉపయోగించుకోవాలన్నారు.

## జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలి

**నడిగూడెం, నవంబర్ 1 ప్రభాతవార్త**

నడిగూడెం మండల కేంద్రంలో ఈ నెలలో జరిగే ఎఐటియుసి జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానికంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎఐటియుసి జిల్లా రెండవ మహాసభల సన్నాహక సమావేశం జరిగింది. అనుబంధ సంఘాలన్ని సహాయ సహకారాలు అందించి జిల్లా సభను విజయవంతం చేయాలని కోరారు. పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభ ద్వారా కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎండి అఫ్జల్, అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పసుపులేటి మల్లిఖార్జున్, దేవరంగుల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం. ధనయ్య, సహాయ కార్యదర్శి వెంకన్నతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లతీఫ్, లింగయ్య, సోమయ్య, శ్రీనివాస్, రమేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానం

**మునగాల, నవంబర్ 1 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని హరిహరసుత శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి మాలధారులకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి దాతలు మండవ కోటేశ్వరరావు – నాగమణి దంపతులు 50 కెజిల బియ్యం, గాయం సత్యనారాయణ రెడ్డి పద్మ దంపతులు 50 కెజిల బియ్యం, అనంతుల గురునాథం అనురాధ దంపతులు 20 కెజిల కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు.

# కులగణనకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడం హర్షం: బిసి సంఘం

**మిర్యాలగూడ క్రైం, నవంబర్ 1 ప్రభాతవార్త**



కులగణనలో బిసిల గణన చేయాలి ్సందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడం పట ్ల బిసి సంక్షేమ సంఘం అధ ్వర్యంలో హర ్షం వ్యక ్తం చేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాటా ్లడుతూ జనగణనలో బిసిలను లెకి ్కంచాలని వివిధ బిసి కుల సంఘాలు దేశవ్యాప ్తంగా ఉద్యమిసు ్తన్నాయని, బిసిల ఉద్యమానికి మద ్దతుగా దేశంలోని 22 రాజకీయ పార్ ్టలు ప్రధాని నరేంద్రమోదీకి లేఖలు రాశాయని, అలాగే ఏడు రాష్ట్రాల అసెంబీల్లో ్ల ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలోబిసి సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు వుప్పా ్పల సత్యం, బంటు వెంకటేశ ్వర్లుముదిరాజ్, జయమ్మ, రవి, ఫరూక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# హింసను ప్రోత్సహిస్తున్న కెసిఆర్: కిషన్‌రెడ్డి

**ఓటమి భయంతోనే ఈటెల వాహనాలపై దాడి**
**దిగజారుడు వ్యవహారం చేస్తున్న టిఆర్‌ఎస్**
**ఈటెల రాజేందర్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి**
**గులాబి జెండా కనిపిస్తే స్థానిక పోలీసులు సెల్యూట్ చేస్తున్నారు**
**విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణ**

**మునుగోడు, నవంబర్ 1 ప్రభాతవార్త**



మునుగోడు నియోజకవర్గంలోని పలివెల గ్రామంలో మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మునుగోడు మండల కేంద్రంలో టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎన్నికల ప్రచారం రోడ్‌షో నిర్వహిస్తుండగా మండలంలోని కిష్టాపురం, ఇప్పర్తి గ్రామాల నుండి తరలివస్తున్న టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలివెల గ్రామంలో ఎదురై తోపులాట జరగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఘర్షణ నెలకొని రాళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో కార్ల అద్దాలు, బైకులు ధ్వంసం కాగా ఇరువర్గాల నాయకులకు గాయాలు కావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం ఈటెల రాజేందర్ కాన్వాయ్‌ను మునుగోడు మండల కేంద్రంలోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏర్పాటు చేసి క్యాంపు కార్యాలయానికి వెళ్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ దాడి సంఘటనలో గాయపడిన ఈటెల రాజేందర్ సిబ్బంది, టిఆర్‌ఎస్ నాయకులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ హింసను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా మండలంలోని పలివెల గ్రామంలో ప్రచారం చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ వాహనాలపై పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన టిఆర్‌ఎస్ గుండాలు దాడి చేయడం దారుణమన్నారు. టిఆర్‌ఎస్ పార్టీకి ఓటమి తథ్యమని భావించి గ్రామాల్లో మండలాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు వారు ప్రయత్నం చేస్తున్నారన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేలు వారి అనుచరులను, గుండాలను తీసుకువచ్చి దాడులు చేస్తున్నారన్నారు. ఇటీవల చండూరులో జరిగిన కెసిఆర్ సభలో కెసిఆర్ మాట్లాడుతున్న తీరు హింసను ప్రోత్సహించినట్లే ఉందన్నారు. రోజు రోజుకు టిఆర్‌ఎస్ చేస్తున్న ఆగడాలను స్థానిక పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్నారు. గులాబి జెండా కనబడితే స్థానిక పోలీసులు సెల్యూట్ చేస్తున్నారన్నారు. చెక్‌పోస్టుల వద్ద కనీసం ఆ వాహనాలను ఆపడం లేదన్నారు. ఇట్టి విషయంపై డీజీపీతో చర్చించనున్నట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఈటెల రాజేందర్‌పై కక్ష సాధింపు జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర జిల్లాల నుండి వచ్చిన నేతలు పక్కా ప్లాన్‌తో ఈటెల రాజేందర్‌పై దాడికి దిగారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఈటెల ముఖం చూడొద్దని అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కెసిఆర్ అవమానపరుస్తున్నారన్నారు. ఈ నెల 3వ తేదీన జరిగే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేట్‌లకు వత్తాసు పలికే బిజెపికి డిపాజిట్లు గల్లంతు కావాలి

**మునుగోడులో ఒక వ్యక్తి అమ్ముతుపోతే ఉప ఎన్నిక వచ్చింది**
**నియోజకవర్గాన్ని అనాధలా వదిలేసిన కాంట్రాక్టర్ కాలకేయుడు**
**మహిళలు బిజెపికి ఓటు వేస్తే సిలిండర్ ధర రూ.3 వేలకు పెరుగుతుంది**
**కాకులను కొట్టి గద్దలకు వేసే నీచమైన సంస్కృతి బిజెపిది**
**ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?**
**నియోజకవర్గ దత్తత హామీని నిలుపుకుంటా**
**మునుగోడులో 2014 తరువాతనే అభివృద్ధి ప్రారంభమైంది**
**60 ఏళ్ల కాంగ్రెస్, బిజెపి పాలనలో మునుగోడు ఆగమైంది**

**మునుగోడు, నవంబర్ 1 ప్రభాతవార్త**



కార్పరేట్‌లు, కాంట్రాక్టర్లకు వత్తాసు పలికే బిజెపికి డిపాజిట్లు గల్లంతయ్యే విధంగా మునుగోడు ప్రజలు ఉప ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, టిఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేరొ ్కన్నారు. మునుగోడు ఎన్నికల్లో వామపక్షాలు బలపర్చిన టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం నియోజకవర్గ పరిధిలోని నారాయణపురం, మునుగోడు మండల కేంద్రాల్లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, వామపక్షాల రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ఆయన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోదీ జన్‌ధన్ ఖాతా కోలో మై దన్ దన్ పంద్రా లాక్ దేతుం అని చెప్పిన మాటలను నిలబెట్టుకోలేదన్నారు. మునుగోడు నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఇచ్చిన హామీకి నేను కట్టుబడి ఉన్నానని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని టిఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా నియోజకవర్గానికి చేసిన పనులు, తెచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణపై కుట్రలు చేస్తూ అడుగడుగునా ప్రగతిని అడ్డుకుంటున్న ప్రధాని మోదీని, బిజెపి నాయకులను ఉతికి ఆరేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనులను అమలు చేసిన పథకాలను అంకెలతో సహా వివరించి ప్రత్యర్థుల నోళ్లకు తాళం వేశారు. ఇక్కడ జరుగుతున్న పోరాటం రెండు భావజాలాల మధ్యన, రెండు పార్టీల మధ్యన కానీ ఇద్దరు వ్యక్తుల మధ్య కాదని ఆయన తెలిపారు. రూ. 18 వేల కోట్లకు అమ్ముడుపోయిన రాజగోపాల్‌రెడ్డి ఇంటింటికి తులం బంగారం ఇచ్చినా ఇస్తడు. తులం బంగారం ఇచ్చినా తీసుకోండి అవన్నీ దొంగ పైసలు, గుజరాత్ వాళ్ల పైసలన్నారు. బిజెపికి ఓటుతోనే సమాధానం చెప్పండన్నారు. మునుగోడును సస్యశ్యామలం చేయబోతున్నామన్నారు. రాచకొండకు కూడా లిఫ్టులు ఇస్తామన్నారు. రాజగోపాల్‌రెడ్డి రూ. 18 వేల కోట్ల కాంట్రాక్టుకు మునుగోడు ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టాడన్నారు. నాలుగేళ్ల నుండి ఒక్క పని కూడా చేయలేదన్నారు. మునుగోడులో నెలకొన్న సమస్యల గురించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మునుగోడు ఉప ఎన్నిక రాలేదని, ఒక వ్యక్తి అమ్ముడుపోతే ఉప ఎన్నిక వచ్చిందన్నారు. తన వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసం నియోజకవర్గాన్ని అనాథలా వదిలేసిన కాలకేయుడు రాజగోపాల్‌రెడ్డి అని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 400 ఉంటే ఇప్పుడు రూ. 1200లకు పెంచాడన్నారు. అదే విధంగా పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలను కూడా పెంచి సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి కలిసి సమిష్టిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయానికి, అన్యాయానికి జరుగుతున్న పోరాటం మునుగోడు ఉప ఎన్నిక అని అన్నారు. మునుగోడులో జరుగుతున్నది ధర్మయుద్ధమన్నారు. 60 ఏళ్ల కాం గ్రెస్, బిజెపి పాలనలో మునుగోడు ఆగమైందని, 2014 తరువాతనే మునుగోడు అభివృద్ధి ప్రారంభమైందన్నారు. ఫ్లోరోసిస్ మహమ్మారిని తరిమికొట్టి మునుగోడును స్వచ్ఛగా మార్చింది కెసిఆర్ అని, ఇంకా మునుగోడును సస్యశ్యామలం చేసుకుని పూర్తిగా ఫ్లోరోసిస్‌ను తరిమికొట్టి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలంటే టిఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. 14 నెలల్లో మునుగోడును బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ ప్రజలు ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలన్నారు. మందు, మటన్ పెట్టగానే గందరగోళం కావద్దన్నారు. ఎవరి వలన మన బతుకులు బాగుపడతాయో ఆలోచించాలని, రైతుబంధు కావాలో, రాబంధు కావాలో ఆలోచించుకోవాలన్నారు. కెసిఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మునుగోడులో ప్రాజెక్టులను అడ్డుకున్న బిజెపిని, బిజెపికి అమ్ముడుపోయిన దొంగను ప్రజలు ఓటుతో తరిమికొట్టాలన్నారు.

# ఘనంగా ఒట్టికోట ఆల్వార్ స్వామి జయంతి

**వేములపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త:**





నిజాం నిరంకుశ పాలనపై తన కలంతో గలమెత్తి ప్రజలను చైతన్యపరచి, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ ఉద్యమాలతో ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి దోపిడికి వ్యతిరేకంగా ప్రజలను పీడిస్తున్న భూస్వాములైన ఆనాటి పటేల్, పట్వారి, దొర, దేశ్‌ముఖ్ వ్యవస్థకు చరమగీతం పాడడానికి ప్రజలను తన ప్రజల మనిషి, గంగు నవలలు జైలు లోపల చిన్నప్పుడే కథల ద్వారా చైతన్యపరచిన కవి ఒట్టికోట ఆల్వార్ స్వామి అని రావులపెంట జడ్ ్పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎం.మంగళ అన్నారు. ఒట్టికోట ఆల్వారు స్వామి జయంతిని పురస్కరించుకుని రావులపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర ్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజం దోపిడికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలి జగన్మోహన్, పి.అమరేందర్‌రెడ్డి, కె.శ్రీధర్‌కుమార్, నల్లమేకల వెంకయ్య, గుడిపాటి కోటయ్య, చాడ విజయనిర్మల, కరీం, సైదులు, వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# చంపుకుంటారో....సాధుకుంటారో మీ ఇష్టం

**ఆడబిడ్డను కంటతడ్డి పెట్టనీయకండి**
**స్రవంతిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిని చేస్తా**
**మునుగోడును దత్తత తీసుకుంటా**
**మునుగోడు, నవంబర్ 1 ప్రభాతవార్త**

మునుగోడు ఆడబిడ్డ స్రవంతిరెడ్డి సంపుకుంటారో... సాధుకుంటారో మీ ఇష్టమని, ఆడబిడ్డ కంటతడి పెడితే రాజ్యానికి మంచిది కాదని ఆడబిడ్డను కంటతడి పెట్టనీయకండి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునుగోడులో నిర్వహించిన ఆడబిడ్డల ఆత్మగౌరవ సభలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి భార్య, స్రవంతిరెడ్డి మాతృమూర్తి గోవర్ధన్‌రెడ్డి చనిపోయిన తరువాత ఆమె బయటకు రావడ ం లేదని, ఇప్పుడు స్రవంతిని మీ చేతుల్లో పెట్టడానికి వచ్చారన్నారు. ఇప్పటి నుండి స్రవంతి మీ బిడ్డ సంపుకుంటారో సాధుకుంటారో మీ ఇష్టమన్నారు. ఈ ఎన్నికల్లో స్రవంతిని గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లో 15 మంది మహిళలకు ఎమ్మెల్యే టికెట్‌లతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నలుగురు మహిళా ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తానని, ఆ నలుగురిలో స్రవంతి ఉంటుందని ఉంటుందన్నారు. స్రవంతిని గెలిపిస్తే మునుగోడును దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మునుగోడును అభివృద్ధి చేసే భాధ్యతను తాను తీసుకుంటానని ఆయన వ్యాఖ్యానించారు. మునుగోడు నియోజకవర్గానికి ఒక చరిత్ర ఉందన్నారు. ఈ గడ్డ మీద పుట్టిన ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ఇక్కడి ఆడబిడ్డల పౌరుషాన్ని ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి గడ్డ మీద ఇప్పుడు మునుగోడు ఉప ఎన్నిక వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు తీసుకునే నిర్ణయం రాష్ట్ర భవిష్యత్‌ను మార్చబోతుందన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో మోదీ చేసిన మోసం, కెసిఆర్ చేసిన ధోఖా మీద మారు తీర్పు ఇవ్వబోతున్నారన్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఎవరి కీ రాని అవకాశం మీకు వచ్చిందన్నారు. మి మ్మల్ని, మమ్మల్ని, విద్యార్థులు, నిరు ద్యోగులు, ఉద్యమ కారులను మోసం చేసి నట్టేట ముంచి మన ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన కెసిఆర్‌ను 100 మీటర్ల లోతులో పాతిపెట్టే అవకాశం మీకు దక్కిందన్నారు. గుజరా త్, ఢిల్లీల నుండి తీసుకువచ్చిన సీసాలు, నోట్ల కట్టలతో ఓట్లు కొనుగోలు చేయాలను కుంటున్న బిజెపికి గుణపం చెప్పాల్సిన భాద్యత నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. మునుగోడు ఎన్నికల్లో మూడు పార్టీల నుండి ముగ్గురు పోటీ చేస్తున్నారని, ఇప్పటి వరకు జరిగిన ఎని కల్లో బిజెపి గెలవలేదన్నారు. ఎవరికో పుట్టిన బిడ్డను నా బిడ్డ అని బిజెపి నాయకులు సిగ్గు లేకుండా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఏమి తక్కువ చేసిందని, ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా చేస్తే కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి బిజెపిలో చేరాడన్నారు. బిజెపిలో చేరితే తమకెలాంటి అభ్యంతరం లేదని, ఎవడి మాటలో విని కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని చంపాలని బొడ్డులో కత్తి పెట్టుకుని తిరుగుతుండన్నారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిన బిజెపి నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎంపి రంజితా రంజన్ మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి మహిళలు తమ శక్తిని చూపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణను అనుకున్న విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఒక మహిళకు ఓటు వేస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళలను గౌరవించలేని వ్యక్తులకు స్రవంతి గెలుపు గుణపాఠం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి జ్యోతిమణి, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, గీతారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, మహిళలు పాల్గొన్నారు.




# అధికారులు వద్దన్నారు.. వైన్స్ షాప్ యాజమాన్యం అమ్ముతున్నారు

**బలి పశువులుగా మారుతున్న బెల్ షాప్ యజమానులు**
**నాగారం నవంబర్ 1**



నాగారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న బెల్ షాపులలో మద్యం ఫుల్ బాటిల్ అమ్మ వద్దని ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గత నెలలో నాగారం తహసిల్దార్ ముందు బెల్ట్ షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసి వారిని నుండి షరతులతో బెల్ట్ షాపులో మద్యం ఫుల్ బాటిల్ అమ్మినట్లయితే రెండు లక్షల రూపాయల జరిమానా విధించబడుతుందని ఒప్పంద పత్రాన్ని రాయించుకున్నారు. ఈ ఒప్పందం రాయించుకొని 15 రోజులు గడవక ముందే వైన్ షాప్ నిర్వాహకులు మాత్రం మద్యం ఫుల్ బాటిల్లను మద్యం షాపు నిర్వాహకులకు అమ్ముతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం మామూల కోసం మాత్రమే నెలకు ఒకసారి నామ మాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఎక్స్చేంజ్ అధికారుల నిర్లక్ష్యం వలెనే వైన్ షాప్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం నాగారం మండల కేంద్రానికి రెండు వైన్ షాపులు మంజూరైనాయి. రెండు షాపులకి రెండు పర్మిట్ రూములు, రెండు వినియోగదారుల కౌంటర్లు, రెండు బెల్ట్ షాప్ కౌంటర్లు నిర్వహించాల్సి ఉండగా ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఒకే పర్మిట్ రూము ఒక వినియోగదారుల కౌంటర్ ఒకటి బెల్ట్ షాపుల కౌంటర్ మాత్రమే నిర్వహిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అధికారుల నిఘ లేకపోవడంతో వైన్ షాప్ లోనే మద్యం కల్తీ జరుగుతుందని మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్ షాపులపై దాడి నిర్వహిస్తే బలి పశువులుగా మారేది బెల్ట్ షాపు యాజమాన్యం మాత్రమే అని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా జిల్లా యంత్రంగా స్పందించి వైన్స్ యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు బెల్ట్ షాప్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.బెల్ట్ షాపు నిర్వాహకుడి వివరణ.గత అక్టోబర్ నెలలో బెల్ట్ షాప్ నిర్వాహకులను ఎక్సైజ్ శాఖ అధికారులు తాసిల్దార్ కార్యాలయం ముందు బైండోవర్ చేసి రెండు లక్షల జరిమానా పత్రంపై సంతకం చేయించుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు బదులు బెల్ట్ షాపులపై వైన్స్ షాప్ యజమానులు దాడులు నిర్వహించడం ఏమిటని మంగళపల్లి రాజిరెడ్డి ప్రశ్నించారు.

# రేణుక ఎల్లమ్మ గుడిలో చోరీ

**రాజాపేట, నవంబర్ 1 ప్రభాతవార్త**



రాజాపేట మండలం బేగంపేట గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీకి పాల్పడినట్లు సర్పంచ్ బొమ్మ కరుణాకర్ మంగళవారం పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఆలయం ముందు తలుపులు పగలగొట్టి ఆలయంలోనికి ప్రవేశించిన దింగలు హుండీ, బంగారు ముక్కుపుడక, వెండి పెట్టెలు చోరీ చేసినట్లు తెలిపారు. ఎసై శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వార్త ప్రభావం

**తుర్కపల్లి మేనేజర్ సూపర్వైజర్ సస్పెండ్**
**యాదగిరిగుట్ట ,నవంబర్ 1 ప్రభాతవార్త** మదర్ డైరీ ఆధీనంలోని తుర్కపల్లి ఎం సి సి పరిధిలోని మూడు పాల సొసైటీలలో అక్రమాలకు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో మంగళవారం మదర్ డైరీ అధికారులు తుర్కపల్లి ఎం సి సి మేనేజర్ శివకుమార్ ,సూపర్వైజర్ మహేష్ లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ములకలపల్లి ,వెంకట్ రెడ్డి, నగర్ గోపాల్ పురం పాలసొసైటీలలో రెండు సంవత్సరాల నుండి పాల సేకరణ లేకున్నా జరిగినట్లు తప్పుడు బిల్లులు సృష్టించి లక్షల రూపాయలు ఖా చేసినట్లు ప్రాథమికంగా విచారణ లో స్పష్టమైందని అధికారులు చెప్పారు. ఖివార్తఖి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. నాలుగు సంవత్సరాల నుండి తుర్కపల్లి ఎం సి సి పరిధిలోని 30 పాల సెంటర్లలో జరిగిన పాల సేకరణ చెల్లించిన బిల్లుల వివరాలను పూర్తిస్థాయిలో ప్రత్యేక అధికారులతో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

# చివరి భూములకు నీళ్ళు అందించాలని వినతి

**పెన్‌పహాడ్ నవంబర్ 1 ప్రభాతవార్త:**



శ్రీరాంసాగర్ నీళ్లను చివరి భూముల వరకు అందించాలని ఇరిగేషన్ ఏఈ లింగయ్యకు మండల పరిధిలోని లింగాల గ్రామరైతులు మంగళవారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి నీళ్ళు చివరి భూముల వరకు అందడం లేదని, కొంతమంది రైతులు కాలువలను ఆక్రమించుకోవటంతో ఈ పరిస్థితి నెలకొందని వినతి పత్రంలో పేర్కొన్నారు. కావున కాలువలను పునరుద్ధరించి చివరి భూముల వరకు నీళ్ళు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందచేసిన వారిలో లింగాల గ్రామ రైతులు జూకురి గాంధీ, బొల్లం నాగరాజు, కర్ణం యాదగిరి, మేకల ప్రసాద్, సుంకరి గురవయ్య, వార్డు సభ్యుడు కొమ్ము నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జోడో భారత్ పాదయాత్రలో పాల్గొన ఆలేరు కాంగ్రెస్ నాయకులు

**ఆలేరు టౌన్, ప్రభాతవార్త**



రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ప్రారంభించిన భారత్ జోడో యాత్రలో భాగంగా నేడు హైదరాబాదులో జరిగే పాదయాత్ర లో మంగళవారం ఆలేరు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగిరి విద్యాసాగర్, మండల ఉపాధ్యక్షులు ఆంజనేయులు, బహదూర్ పేట నాయకులు కుళ్ళ పెద్ద సిద్దులు, వట్టిపల్లి సిద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# వీరమ్మ మృతి పట్ల టిఆర్ఎస్ నాయకుల సంతాపం

**పెన్‌పహాడ్ నవంబర్ 1 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మాచారం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గ్రంధి వెంకటేశ్వర్లు మాతృమూర్తి మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకు రాలు గ్రంధి వీరమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి జడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, రైసస మండల అధ్యక్షుడు పొదిల నాగార్జున, ముదిరెడ్డి రంగారెడ్డి, ఎంపీటీసీ నాగునాయక్, బొల్లక బొబ్బయ్య, టిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు బొల్లక లింగయ్య యాదవ్, ఖమ్మంపాటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**ఎంఈఓ బోయినీ లింగయ్య**
**విద్యార్థులకు యూనిఫామ్ టై బెల్టులు అందజేత**
**తుంగతుర్తి నవంబర్ 1**



విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎంఈవో బోయినీ లింగయ్య అన్నారు. మండల పరిధిలోని వెంపటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 350 మంది విద్యార్థులకు మణికంఠ బుక్ స్టాల్ యజమాని తొట్ల సుధాకర్, వెంపటి గ్రామానికి చెందిన చిర్ర దిలీప్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నాగుల గణేష్ దాతల సహకారంతో సుమారు 20వేల రూపాయల విలువగల టై బెల్టులను మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. దాతల ఆర్థిక చేయుతతో వెంపటి ప్రాథమిక పాఠశాల సకల వసతులతో కూడిన విద్య అందుతుందన్నారు.దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూదగాని వెంకట్రామనర్సమ్మ,పాఠశాల చైర్మన్ పుల్లూరు అంబేద్కర్, ఉపసర్పంచ్ భాషబోయిన వెంకన్న,గ్రామపెద్దలు అబ్బగాని సత్యనారాయ ణ,ఉపాధ్యాయి ని,ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్,పి.జ్యోతి, మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయ లు.రమాదేవి,స్వా తి,మంజుల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజపేటలో ఘనంగా హరే రామ నామ నగర సంకీర్తన

**రాజాపేట, నవంబర్ 1 ప్రభాతవార్త**





మండల కేంద్రమైన రాజాపేట లో శతకోటి హరే రామ నామ జప యజ్ఞం కార్యక్రమంలో భాగంగా నగర సంకీర్తన కార్యక్రమాన్ని సోమవారం రాత్రి చేపట్టారు. శ్రీ పాండురంగ శ్రమం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం జగదేవపూర్ భక్త బృందం ద్వారా రాజాపేట లో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తజనులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని తమ జన్మ ధన్యంగా భావించారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుండి ప్రారంభమైన నగర సంకీర్తన కార్యక్రమం ప్రధాన వీధుల గుండా ఏకనామ హరే రామ నామ సంకీర్తనతో అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా, ఘనంగా, సాంప్రదాయ బద్ధంగా ,సాగింది. భక్తులు భజన చేస్తూ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి నామ స్మరణలో మంత్రముగ్ధులై నృత్యాలు చేస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాండురంగ ఆశ్రమం స్వాములు భావానంద స్వామి ఇతరులు స్వాములు పాల్గొన్నారు. శ్రీధర పంతులు పాల్గొని శతకోటి హరే రామ నామ జప యజ్ఞం వివరాలు తెలుపగా అనేకమంది స్వచ్ఛందంగా నామ జప యజ్ఞంలో భాగస్వామ్యం అవుతామని ముందుకు వచ్చి తమ అంగీకారాన్ని తెలిపారు. ఇలాంటి కార్యక్రమం లో పాల్గొనడం రాజాపేట లో నిర్వహించడం తమకెంతో సంతోషంగా ఉందని రాజాపేట వాసులు మార్త జగదీశ్వర్, బెజుగం నాగభూషణం, ఇమ్మడి శ్రీనివాసులు, నంగునూరు రాజు, సోమయ్య, బెజగం శ్రీనివాసులు, బిజిగం చంద్రశేఖర్, గంగిశెట్టి రాజు, ఇమ్మడి శ్రీనివాసులు, బుదుమ సత్యనారాయణ, యశ్వంత్, నాల్ల శేఖర్, పుల్లూరి శ్రీనివాసులు, బెజుగం లింగమూర్తి, సోమసాని రాజ మల్లయ్య, రాపోలు రామచంద్రారెడ్డి, బాలకిషన్, ఊట్కూరి శ్రీనివాసులు, నేమిలాకు చెందిన కుసునాల రామచందర్, సాయి, గౌటే బాలరాజు, బిర్రు శ్రీనివాసులు, సకినాల శ్రీనివాసులు, సోమసాని చంద్రమోహన్, బత్తిని సుధాకర్,డాక్టర్ బాగా జ్ఞానేందర్ ,పొబ్బోజు రాధమ్మ తదితరులున్నారు. అనంతరం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు భజనలు తీర్థ ప్రసాద వితరణ జరిగాయి సామూహిక భోజనాలు అల్పాహారం నిర్వహించారు. ప్రతి నెల ఏకాదశి రోజు నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టాలని మర్కుక్ శ్రీ పాండురంగ ఆశ్రమం పంతులు తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఏకైక సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లకు 25వేల రూపాయల జరిమానా

**రాజాపేట, నవంబర్ 1 ప్రభాతవార్త**

రాజాపేట మండలం కుర్రారం గ్రామ సమీపము నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని ఎస్సై శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఐదు ట్రాక్టర్లను తాసిల్దార్‌కు అప్పగించగా మంగళవారం తాసిల్దార్ గిరిధర్ ఒక్కొక్క ట్రాక్టర్‌కు 5000 రూపాయల చొప్పున 25 వేల రూపాయలను జరిమానా విధించినట్లు తాసిల్దార్ తెలిపారు.

# సామూహిక గోపూజ కార్యక్రమం

**రాజాపేట, నవంబర్ 1 ప్రభాతవార్త**



విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రఘునాధపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో, గోపాష్టమి సందర్భంగా సామూహిక గోపూజ కార్యక్రమము. అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించబడడం జరిగినది. ఈ కార్యక్రమంలో రఘునాథపురం గ్రామము పరిసర గ్రామాలలోని మహిళలు మరియు. విశ్వహిందూ పరిషత్. శ్రీ బల్ల దుర్వాసులు జిల్లా గోరక్ష, ఆకు దొట రామారావు క్షేత్ర గో సేవ ప్రముఖ, బెజ్జాల ఈశ్వర్ విహెచ్పి మండల ఉపాధ్యక్షులు ,తమ్మలి శ్రీహరి, విహెచ్పి మండల కార్యదర్శి బూరల శ్రీనివాస్ ,చిలుక లక్ష్మీనారాయణ, సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్, ఎంపిటిసి బుడిగే రేణుక పెంటయ్య గౌడ్ ,దేవస్థానం వైస్ చైర్మన్ రాచకొండ స్వామి , కమిటీ సభ్యులు సామల భాస్కర్ ,బొద్దుల వెంకటేశం ,కటకం వెంకటేశం బల్ల నరహరి,పరిసర గ్రామ మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# ఫీజు చెల్లింపుకు 10వ తేదీ తుది గడువు

**కేతేపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కోరే విద్యార్థులు అపరాధ రుసుముతో ఈ నెల 10లోపు ఫీజు చెల్లించాలని ప్రధానోపాధ్యాయుడు కోఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, సహాయ కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డిలు తెలిపారు. సర్టిఫికెట్‌లను తీసుకువచ్చి పాఠశాలలో ధరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు 10వ తేదీ తుది గడువు అయినందున ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# కార్యకర్త మృతికి సంతాపం తెలిపిన దైద రవీందర్

**కేతేపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త** మండల పరిధిలోని కాసనగోడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మోదుగు సంజీవరెడ్డి మాతృమూర్తి మృతి పట్ల టిపిసిసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ సంతాపం తెలిపారు. మంగళవారం గ్రామంలో ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చల్లా జానకిరామ్‌రెడ్డి, చల్లా వెంకట్‌రెడ్డి, బూతుకూరి వెంకట్‌రెడ్డి, అమృతారెడ్డి, ఎండి యూసుఫ్, పందిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు ఐక్యంతో హక్కులు సాధించుకోవాలి

**-రాష్ట్ర కౌని ్సల్ సభ్యులు డబీ ్బకార్ మల్లేష్**
**మిర్యాలగూడ అర ్బన్, నవంబర్ 1 ప్రభాతవార్త**



కార్మికుల సంక్షేమానికి సిఐటియూ నాయకత ్వం పనిచేయాలని సంఘం రాష ్ట కౌని ్సల్ సభ్యులు డబీ ్బకార్ మల్లేష్ అన్నారు. బిల ్డంగ్ వర ్కర్ ్స యూనియన్ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన కంచి కేశవులు, ఉపాధ్యక్షులు బిఎంనాయుడు, సభ్యులు వెంకటయ్య, కాశమ్మలను మంగళవారం స ్ధానిక సిపిఎం కార్యాలయంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట ్లాడుతూ అసంఘటితరంగ కార్మికులను ఐక్యం చేసి వారి హకు ్కల సాధన కోసం సిఐటియూ రాజీ లేని పోరాటం చేసు ్తందని, ఐక్యంగా ఉండి హకు ్కలు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు డాక్టర్ మల ్లు గౌతమ్‌రెడ్డి, పట్ట ణ కనీ ్వనర్ తిరుపతి రాంమూర ్తి, భవాండ్ల పాండు, సోమయ్య, మంద రాజు, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

# ఎపిజివిబి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

**వేములపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త:**




ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ వేములపల్లి బ్రాంచి మేనేజర్ గోపి దేవర ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎన్ఎస్‌పి క్యాంపులో విజిలెన్స్ అవర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో బ్యాంకు సేవలు అందించుటకు, పొందుటకు మేము ఎవరి వద్ద లంచం తీసుకోము, మేమేవరికి లంచం ఇవ్వబోము అని మేనేజర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు వేములపల్లిశాఖలో ఖాతాదారులతో సేవలను అందించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. పొదుపు ఖాతాలతో పాటు విద్య వాణిజ్య, వ్యవసాయ, స్వయం ఉపాధి పొందేందుకు రుణాలను అతి తకు ్కవ వడ్డీ రేటుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఫిక్స్ డిపాజిట్‌పై గరిష్ట వడ్డీరేటు, బంగారు రుణాలపై అతి తక్కువ వడ్డీపై తక్షణ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులకు ప్రభుత్వ సబ్సిడి రుణాలు పొందేందుకు ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో తోడ్పాటును అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రవికిరణ్, క్యాషియర్ నర్మద ఖాతాదారులు షేక్ మౌలాలి, జగదీష్, గంధం నాగరాజు, చింతకుంట్ల ప్రశాంత్‌రెడ్డి, చిర్ర శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మమ్మ, అలివేలమ ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**-జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు, డాక్టర్ మునీర్‌అహ్మద్‌షరీఫ్**
**మిర్యాలగూడ క్రైం, నవంబర్ 1 ప్రభాతవార్త**

ఉచిత వైద్య శిబిరాలను సది ్వనియోగం చేసుకోవాలని జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు, డాక్టర్ మునీర్‌అహ్మద్‌షరీఫ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత ్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అయన ప్రారంభించారు. అనంతరం అయన మాట ్లాడుతూ వాకర్ ్స అసోసియేషన్, జనయేత్రి సంయుక ్త అధ ్వర్యంలో ప్రతి నెల 1వ తేదిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర ్వహించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర ్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు బాలాజీ, సమియొద్దీన్‌లు మాట ్లాడుతూ పేద రోగులు వైద్య శిబిరాలకు వచ ్చి తమ జబ ్బులు నయం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్ ్స అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు మట్టారెడ్డి, శ్రీధర్‌గౌడ్, పోగుల సైదులు, కౌని ్సలర్ రవినాయక్, డాక్టర్ తులసీరామ్, షఫీ, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలి

**డిండి, నవంబర్ 1 ప్రభాతవార్త**




కార్మికుల హక్కుల కోసం ఎఐటిసియుసి నిరంతరం పోరాడుతుందని ఎఐటిసియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం డిండిలో జరిగిన ఏఐటియుసి మండల 7వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమే 1920 అక్టోబర్ 31వ తేదీన ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, బ్రిటిష్ కాలంలోనే కార్మికుల హక్కుల కోసం పోరాడి చట్టాలు సాధించిన దేశంలోని మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమూలంగా మార్చివేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా చేస్తూ కార్మికుల పొట్టగొడుతున్నారని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలు నాలుగు కోడ్ లుగా మార్చి కార్మికుల హక్కులు కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే ఏకైక మార్గమని కార్మిక లోకం హక్కుల కాపాడడం కోసం పోరాటాల తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలని దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ మహాసభకు నూనె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ మైనుద్దీన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తూం బుచ్చిరెడి,ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి నూనె రామస్వామి, అంగన్వాడి జిల్లా ఉపాధ్యక్షురాలు ఈ.అరుణ,ఆర్గనైజింగ్ సెక్రటరీ జూలూరు వెంకట్రాములు,ఏ.మల్లయ్య,ఎలిమినేటి దేవయ్య, బుషిపాక లింగమయ్య,ప్రవీణ్ కుమార్ ప్రేమయ్య, రంగయ్య, ఆంజనేయులు, హరికృష్ణ ,ఎండి నిరంజన్, సాయిలు, చెన్నయ్య, చంద్రకళ ,లావణ్య శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మిక సంఘం నూతన కార్యవర్గం

**కట్టంగూర్, నవంబర్ 1 ప్రభాతవార్త** మండలంలోని ఇస్మాయిల్ పల్లి గ్రామంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద గౌడ్ మాద రవి, అధ్యక్షులు మాద పెద్ద సైదులు, ఉపాధ్యక్షులు మాద హరికృష్ణలను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాద లింగస్వామిగౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాద శ్రీను, మాజీ పెద్ద గౌడు నరసింహ,సైదులు, భాస్కర్, నరసింహ,వెంకన్న, అంతయ్య, చంద్రయ్య, లింగయ్య, మారయ్య, నరేష్,బిక్షం, దుర్గేష్,నాగేషు అశోక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యూవసేన ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**కట్టంగూర్, నవంబర్ 1 ప్రభాతవార్త**



మండలంలోని దుగినవెల్లికి చెందిన ఊట్కూరి లక్ష్మమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా గ్రామానికి చెందిన యువసేన సభ్యులు రూ.7వేలను సేకరించి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు నరేష్,శివశంకర్, ఆంజనేయు లు,రమేష్,సుధాకర్, శివ,అనంద్, కృష్ణ, బండారు సుధాకర్,పాండు, ప్రసాద్, రాజు, మహేష్,సురేష్ పాల్గొన్నారు.